

నేడు భీమవరం రానున్న జగన్



ప్రజాశక్తి - భీమవరం

వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 8వ తేదీ బుధవారం భీమవరం రానున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, నరసాపురం మాజీ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు కుమారుడి వివాహ కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2.40 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి హెలీకాప్టర్ 3.25 గంటలకు భీమవరం చేరుకుంటారు. అక్కడి నుంచి పెదఅమిరంలోని రాధాకృష్ణ కన్వెన్షన్‌కు చేరుకుని 4 గంటలకు నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. తిరిగి హెలీకాప్టర్‌లో బయల్దేరి 5.40 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకోనున్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల జీతాల అవస్థలు..!

ప్రభుత్వాలు మారినా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్ల కష్టాలు మాత్రం తీరడం లేదు. గత ప్రభుత్వ బాటలోనే ప్రస్తుత పాలకులు సైతం జీతాలు సక్రమంగా వేయకపోవడం ఉద్యోగుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జీతాల ఆలస్యంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- పదో తేదీ వరకూ కొనసాగుతున్న ప్రక్రియ
- జీతాల ఆలస్యంతో ఇఎంఐల ఛార్జీల మోత
- 1, 2 తేదీల్లోనే జీతాలు జమ చేయాలంటున్న ఉద్యోగులు
- కాంట్రాక్ట్ లెక్చరర్లు, అంగన్‌వాడీ, ఆశాలు, ఇతర ఉద్యోగులకు జమకాని జీతాలు
- గత ప్రభుత్వ తరహాలోనే నడుస్తున్నారంటూ చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో విద్య, వైద్యం ఇతర రంగాల్లో పని చేసే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు దాదాపు ఐదు వేల మంది ఉన్నారు. డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్లు వందల సంఖ్యలో ఉన్నారు. అంగన్‌వాడీలు రెండు జిల్లాల్లో ఏడు వేల మందికిపైగా పని చేస్తున్నారు. ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు వేలాదిమంది విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ ప్రభుత్వం జీతాలు సకాలంలో జమ చేయని పరిస్థితి కొనసాగుతోంది. గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు సకాలంలో ఇవ్వడంలో విఫలమైంది. దీంతో ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. 2024 ఎన్నికల్లో వైసిపికి వ్యతిరేకంగా ఉద్యోగులంతా ఓట్లేసిన పరిస్థితి కన్పించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలుత ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు వేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. దీంతో ఉద్యోగులంతా సంతోషపడ్డారు. కొద్ది నెలలుగా మళ్లీ పరిస్థితి అధ్వానంగా మారుతోంది. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లకు జీతాలు సకాలంలో జమ కావడం లేదు. జీతాలు జమయ్యేసరికి దాదాపు పదో తేదీ వచ్చేస్తోంది. ఇది ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందిగా పరిణమించింది. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా తమ పిల్లల చదువులతోపాటు ఇతర అవసరాలకు బజాజ్, హీరో ఫైనాన్స్ వంటి ప్రయివేటు సంస్థల నుంచి వ్యక్తిగత రుణాలు తీసుకుంటున్నారు. ఒకేసారి పెద్దఎత్తున సొమ్ము చెల్లించలేక ఇఎంఐ పద్ధతిలో బైక్, టీవీ వంటి వస్తువులు తీసుకుంటున్నారు. ఈ రుణాలకు సంబంధించిన ఇఎంఐలు రెండో తేదీ నుంచి ఐదోతేదీలోపు చెల్లించాల్సి ఉంటుంది. ఆలస్యమైతే రూ.600కుపైగా పెనాల్టీలు పడుతున్నాయి. అంతేకాకుండా సిబిల్ స్కోర్‌పై తీవ్ర ప్రభావం చూపడంతో భవిష్యత్తులో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే పరిస్థితి లేకుండా పోతుంది. ఇది ఉద్యోగులకు పెనుశాపంగా మారింది. పెనాల్టీ రూపంలో కష్టపడిన సంపాదనంతా పోతుందనే బాధ వారిని వెంటాడుతోంది. ప్రభుత్వం సకాలంలో జీతాలు వేస్తే ఇఎంఐలు సకాలంలో చెల్లించే అవకాశం ఉంటుందని, పెనాల్టీల బాధ తప్పుతుందని వారంతా వేడుకుంటున్నారు. ప్రభుత్వం మాత్రం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల గోడు పట్టించుకోవడం లేదు.

సెప్టెంబర్ జీతాలు ఇంకా జమకాని పరిస్థితి

ఈ నెల ఎనిమిదో తేదీ వచ్చేసినా ఇంకా సెప్టెంబర్ నెల జీతాలు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లకు జమ కాలేదు. కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న డిగ్రీ లెక్చరర్లకు ఇప్పటికీ జీతాలు జమకాలేదు. దీంతో వారంతా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. ఎయిడెడ్ ఉద్యోగులకు ఏడో తేదీన జీతాలు జమయ్యాయి. అంగన్‌వాడీలకు, ఆశా వర్కర్లకు ఎప్పటికి జీతాలు జమవుతాయో చెప్పలేని పరిస్థితి ఉంది. మధ్యాహ్న భోజన కార్మికులకు రెండు నెలల జీతాలు పెండింగ్ ఉండిపోయాయి. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకంటే ఎక్కువగా పని చేస్తున్నారు. జీతాల విషయంలో మాత్రం తీవ్ర ఆలస్యం చేయడంతో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రతినెలా ఒకటి, రెండు తేదీల్లో జీతాలు జమ చేయాలని వారంతా కోరుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్ల గోడును పట్టించుకుంటుందో, లేదో వేచిచూడాలి.

నిబంధనలకు విరుద్ధంగా టపాసులు అమ్మితే చర్యలు

మందుగుండు సామగ్రి అమ్మకానికి పిల్లలను వినియోగిస్తే కఠిన చర్యలు

లైసెన్స్ లేకుండా టపాసులు తయారు చేసినా కఠిన చర్యలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో దీపావళి టపాసుల తయారీ, అమ్మకాలు నిబంధనల ప్రకారం జరగకపోతే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. మందుగుండు సామగ్రి అమ్మకానికి పిల్లలను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమన్నారు. లైసెన్స్ లేకుండా టపాసులు తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం దీపావళి టపాసుల తయారీ, అమ్మకాలపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దీపావళిని జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జరుపుకునేలా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలను చేపట్టాలని ఆదేశించారు. గతంలో లైసెన్సు పొంది ప్రస్తుతం రెన్యువల్‌కాని, మందుగుండు సామగ్రి తయారీ షెడ్లను క్షేత్రస్థాయిలో పోలీస్, రెవెన్యూ శాఖలు విధిగా తనిఖీ చేసి ధ్రువీకరించాలన్నారు. నిబంధనలు మీరి మందుగుండు సామగ్రి తయారీ, అమ్మకం షాపులపై చర్యలకు అలసత్వం వహించే అధికారులను ఉపేక్షించేది లేదన్నారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ నిబంధనల మేరకు దీపావళి టపాసుల షాపులను నిర్వహించాలని, తనిఖీల్లో లోటుపాట్లు ఉంటే చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల ఉమ్మడి తనిఖీలు ఉంటాయన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఎఎస్‌పి వి.భీమారావు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బి.శ్రీనివాసరావు, ఆర్‌డిఒలు కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఖతీబ్ కౌసర్ భానో, దాసి రాజు, ఎస్‌బి సిఐ వివిఎన్.సత్యనారాయణ, డిపిఒ రామనాథరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు, జిల్లా కార్మిక శాఖాధికారి ఆకన లక్ష్మి, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ జి.స్వాతి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎనలిస్ట్ సిహెచ్.తేజస్వి, భీమవరం సహాయ మున్సిపల్ కమిషనర్ రాంబాబు, జిల్లా అసిస్టెంట్ ఫైరాఫీసర్ వైవి.జానకీరామ్, అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ వివి.నాగరాజారావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పెంచిన పని గంటలు తగ్గించాలి

- అసెంబ్లీలో తీర్మానించిన బిల్లును రద్దు చేయాలి
- రైతు, కౌలురైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన



ధర్నాలో మాట్లాడుతున్న జక్కంశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం పెంచిన పని గంటలు తగ్గించాలని, గతంలో మాదిరిగానే ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని రైతు, కౌలురైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానించిన పని గంటల పెంపు బిల్లును రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్థానిక ప్రకాశం చౌక్‌లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కార్పొరేట్ల కోసం సంపన్నుల కోసం పని గంటల పెంపుకోసం తీర్మానించడం సిగ్గుచేటన్నారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించలేని కూటమి ప్రభుత్వం పని గంటల పెంపులో మాత్రం ఉత్సాహం చూపడం అన్యాయమన్నారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా పని భారం మోపడం దారుణమన్నారు. కార్యక్రమంలో చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, వైకుంఠం, జార్జి, ప్రజాసంఘాల నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

సిజెఐపై దాడి హేయం

విద్యార్థి, దళిత, ప్రజా సంఘాల నేతలు



భీమవరంలో..



తణుకులో..

ప్రజాశక్తి - భీమవరం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడి రాజ్యాంగంపై దాడే అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు అన్నారు. సిజెఐపై మతోన్మాద దాడిని ఖండిస్తూ మంగళవారం స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌక్ వద్ద విద్యార్థి, దళిత, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న అనంతరం ఈ దాడి జరగడం అంటే దేశ ప్రజలకు ఎలాంటి సంకేతాలు ఇస్తుందో అర్థమవుతుందన్నారు. దేశ ప్రధాన న్యాయమూర్తికే రక్షణ లేదంటే పాలకుల మత విద్వేష భావజాలం ఏ విధంగా పెంచుతున్నారో తెలుస్తుందన్నారు. ఒకవైపు వ్యవస్థలను నాశనం చేస్తూ మరోవైపు రాజ్యాంగం రద్దుకూ బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. ఈ ప్రయత్నాలను ఐక్యంగా అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్, జైభీమ్ సేవాదళ్ నాయకులు మీసాల జయరాజు, బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనా జోసెఫ్ మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తిపై దాడి ప్రజాస్వామ్యానికి పెనుముప్పన్నారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొనని ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తయిన సందర్భంగా పోస్టల్ స్టాంప్ విడుదల చేసిన మోడీకి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఫొటోను కరెన్సీపై ఎందుకు ముద్రించరని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మల్లిపూడి ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ జిల్లా అధ్యక్షులు ఈది రవికుమార్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.ప్రసాద్, బొక్కా గణేష్, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎ.వీరయ్య, నాయకులు పెదపాటి రాజబాబు, ప్రముఖ న్యాయవాది టి.ప్రశాంత్, పి.వాసు, దళిత నాయకులు బి.కమలాకర్, జంగం మాణిక్యాలరావు, సరిపల్లి పండు, కొండేటి లాజర్, అంబటి ఆనందకుమార్, ఆధార్ రాజు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సోడదాసి గంగయ్య, ఉద్యోగ సంఘ నాయకులు ఎన్.అశోక్ కుమార్, బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈది శేఖర్ బాబు, పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, ఇంజేటి శ్రీనివాస్, సింధు, సైదు లక్ష్మణ్, సాయికృష్ణ, నాగేంద్ర, గోవింద్, కొండేటి సుధీర్‌బాబు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచంట: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తూ స్థానిక సెంటర్‌లో ధర్నా నిర్వహించి, అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆచంట నియోజకవర్గ మాల సంఘాల జెఎసి గౌరవాధ్యక్షులు బీరా మధు, నేతలు ఉన్నమట్ల మునిబాబు, బహుజన నేత చింతపల్లి గురుప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో సుంకర సీతారాం, కోట వెంకటేశ్వరరావు, తప్పెట్ల వెంకట్రావు, జెంట్రీ శ్రీను, పిల్లి రుద్రప్రసాద్, పులిదిండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తణుకు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి న్యాయ వ్యవస్థపై దాడి చేయడమేనని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కామన మునిస్వామి అన్నారు. మంగళవారం ఐలూ ఆధ్వర్యంలో న్యాయవాదులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో న్యాయవ్యవస్థకు ప్రత్యేక స్థానం ఉందని, అటువంటి వ్యవస్థకు పెద్ద, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై మతోన్మాది దాడి చేయడం దుర్మార్గమైన చర్యని అన్నారు. న్యాయ వ్యవస్థను కూడా భయపెట్టి వారికి అనుకూలంగా మార్చుకోవాలని చూస్తే ప్రజలు హర్షించరన్నారు. న్యాయవ్యవస్థ రక్షణ కోసం న్యాయవాదులందరూ ఐక్యంగా ఉంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, ఎం.మృత్యుంజయరావు, కొండా శ్రీనివాస్, పుట్ల శ్రీనివాసు, కొమ్మిశెట్టి స్వామి, నాయుడు, షేక్ బాబ్జి, జి.చంద్రరావు, కొల్లి ఆనందకుమార్, దొమ్మేటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా వెళ్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

న్యాయవ్యవస్థను అణగదొక్కాలని చూడటం అన్యాయం

పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి లక్ష్మీనారాయణ

భీమవరంలో న్యాయదేవత విగ్రహానికి జలాభిషేకం

ప్రజాశక్తి - భీమవరం

భారత ప్రజల హక్కులను అంతిమంగా కాపాడేది న్యాయ వ్యవస్థేనని, ఈ వ్యవస్థను అణగదొక్కాలని చూడడం అన్యాయమని భీమవరం మూడో అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి నిరసనగా మంగళవారం సాయంత్రం న్యాయమూర్తి లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో స్థానిక న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కలిసి ర్యాలీ నిర్వహించారు. పాత కోర్టుల ప్రాంగణంలో ఉన్న న్యాయదేవత విగ్రహానికి జలాభిషేకం చేసి శుద్ధి చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి లక్ష్మినారాయణ మాట్లాడుతూ న్యాయవ్యవస్థ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలని ప్రయత్నించినప్పుడు మేమంతా సంఘటితమే అనే సందేశాన్ని సమాజానికి ఇవ్వాలనే దృక్పథంతో న్యాయ దేవతను శుద్ధి చేసుకోవాలని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం.సుధారాణి, జి.సురేష్ బాబు, పి.హనీష, ఎన్.జ్యోతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి యోహాన్ (న్యూటన్), ఎపిపి ఉండవల్లి రమేష్ నాయుడు, ఎజిపి ఉచ్చుల వరప్రసాద్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సిజెఐపై దాడిని అంతా ఖండించాలి: సిపిఎం



నినదిస్తున్న సిపిఎం నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్.గవాయ్‌పై మతోన్మాదుల దాడిని ఖండించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిజెఐపై దాడిని ఖండిస్తూ మంగళవారం సిపిఎం ఆధ్వర్యాన స్థానిక పోలీస్ ఐల్యాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే దాడికి తెగబడటం దారుణమన్నారు. మతోన్మాదులు బరి. తెగిస్తున్నారని, బయట ఎక్కడో దళితుల మీదో, మైనార్టీల మీదో, మహిళల మీదో, గిరిజనుల మీదో దాడులు జరగడం చూశామని, తాజాగా ప్రధాన న్యాయమూర్తిపైనే దాడికి తెగబడటం ఆందోళనకరమన్నారు. దీనికి కారకులను వెంటనే అరెస్టు చేయాలని, రాజ్యాంగం ప్రకారం కఠినంగా శిక్షించాలని అన్నారు. ఇటువంటి దాడులు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, మన దేశ ప్రతిష్టను కాపాడాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై మతోన్మాది దాడిని అంతా ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ ఘటన దేశంలో పెరిగిపోతున్న మతోన్మాదానికి నిదర్శమన్నారు. ఇప్పటికే మోడీ ప్రభుత్వం రాష్ట్రాల్లోని గవర్నర్లను ఉపయోగించుకొని అనేక దాడులు చేస్తున్నారన్నారు. అనేక వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, చివరికి న్యాయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సనాతనం అంటే ఒకరినొకరు గౌరవించుకోవాలని, సనాతనమంటే దాడులు, దౌర్జన్యాలు చేయడం కాదని అన్నారు. కార్యక్రమంలో కె.రాజారామోహన్‌రాయ్, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, డి.కళ్యాణి, పి.వి.ప్రతాప్, కె.అజయకుమారి, కె.ఝాన్సీలక్ష్మీ, ఎమ్‌డి.హసీనా, సిరపరపు రంగారావు, ఎం.త్రిమూర్తులు, సూర్నీడి వెంకటేశ్వరరావు, తెలగంశెట్టి సత్యనారాయణ, కరెడ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు తరలిన ఉపాధ్యాయులు

జిల్లావ్యాప్తంగా 600 మంది పోరుబాట

ప్రభుత్వానికి కనువిప్పు కావాలి

ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ విజయరామరాజు



చలో విజయవాడకు బయల్దేరిన ఉపాధ్యాయ నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఫ్యాప్టో చేపట్టిన పోరుబాటలో భాగంగా చలో విజయవాడ ధర్నాకు ఉపాధ్యాయులు భారీగా తరలి వెళ్లారు. జిల్లావ్యాప్తంగా 600 మంది ఉపాధ్యాయులు పోరుబాట పట్టారు. జిల్లా నలుమూలల నుంచి సమస్యలు పరిష్కరించాలని తరలారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో గత ప్రభుత్వం మాదిరిగానే వ్యవహరిస్తుందని ఉద్యోగ, ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఫ్యాప్టో ఆధ్వర్యంలో పోరుబాట పట్టిన సంగతి తెలిసిందే. బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, మెరుగైన పిఆర్‌సి, మధ్యంతర భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ చలో విజయవాడ ధర్నాకు ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పిఎస్.విజయరామరాజు నేతృత్వంలో జిల్లా నుంచి ఉపాధ్యాయులు భారీగా తరలి వెళ్లారు. జిల్లా కేంద్రం భీమవరంతోపాటు పాలకొల్లు, నరసాపురం, మొగల్తూరు, తాడేపల్లిగూడెం, తణుకు, ఆకివీడు, ఉండి, గణపవరం ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు బస్సులు, కార్లు, మోటార్ సైకిళ్లపై తరలి వెళ్లారు. జిల్లావ్యాప్తంగా 600 మంది ఉపాధ్యాయులు విజయవాడ వెళ్లి ధర్నాలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

చలో విజయవాడ ధర్నాతో ప్రభుత్వానికి కనువిప్పు కావాలి

ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పిఎస్ విజయరామరాజు


చలో విజయవాడ ధర్నాతో ప్రభుత్వానికి కనువిప్పు కావాలని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పిఎస్.విజయరామరాజు అన్నారు. జిల్లాలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా నుంచి వందలాది మంది ఉపాధ్యాయులు విజయవాడ తరలొచ్చి తమ సమస్యల పరిష్కారానికి నినదించారన్నారు. ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమవుతున్న ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు తలుచుకుంటే సాధించలేనిదేదీ లేదనేది మరోసారి నిరూపించారన్నారు. ఐక్యతతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, చలో విజయవాడ ధర్నాను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఉద్యమాభినందనలు తెలిపారు.

నరసాపురంలో ఉద్రిక్తత

చెరువు స్థలంలో చెత్త డంప్ చేయొద్దంటూ స్థానికుల ఆందోళన

పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

భారీగా పోలీసుల మోహరింపు



పెట్రోలు పోసుకుంటున్న వ్యక్తిని నిలువరిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 28వ వార్డు తుంగపాటి చెరువు వద్ద మంగళవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఖాళీగా ఉన్న చెరువు స్థలంలో చెత్త వేయాలని మున్సిపల్ అధికారులు చేసిన ప్రయత్నాన్ని స్థానికులు అడ్డుకున్నారు. చెత్త ట్రాక్టర్లకు అడ్డంగా బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పట్టణ సిఐ బి.యాదగిరి ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించారు. ముందు స్థానికులకు నచ్చజెప్పారు. తాత్కాలికంగానే చెత్త వేస్తున్నామని, త్వరలో మరో ప్రదేశంలో వేస్తామని, స్థానికులకు ఇబ్బందులు లేకుండా చుట్టూ గోడ నిర్మిస్తామని చెప్పారు. అయినప్పటికీ వారు అంగీకరించలేదు. ఆందోళన కొనసాగించారు. ఈ క్రమంలో అదనంగా పోలీస్ బందోబస్త్ రప్పించడంతో ఆందోళనకు దిగిన ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించాడు. ఆందోళన చేస్తున్న వారిపై కూడా పెట్రోల్ పోసే ప్రయత్నం చేశారు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. అదనపు వాహనాలను రప్పించి ఆందోళన చేస్తున్న వారందరికీ వ్యాన్లోకి బలవంతంగా ఎక్కించి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం మున్సిపల్ అధికారులు చెరువులో చెత్తను డంపింగ్ చేశారు. ఇటీవల చెన్నై గ్రీన్ ట్రిబ్యూనల్ పురపాలక సంఘానికి నోటీస్ జారీ చేసింది. గోదావరి ఒడ్డున్న ఉన్న చెత్తను మూడు నెలల్లో తొలగించాలని ఆదేశించింది. దీంతో డంపింగ్ యార్డు ఎక్కడ ఏర్పాటు చేయాలని అధికారులు పలు స్థలాలను పరిశీలించారు. అన్ని చోట్ల ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో వారు ఖాళీగా ఉన్న మున్సిపాల్టీ స్థలంలో వేయాలని నిర్ణయించగా, అక్కడ కూడా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ అధికారులు మరో స్థలం లేకపోవడంతో తాత్కాలికంగా చెరువు స్థలంలో వేయాలని నిర్ణయానికి వచ్చారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అక్షరాంధ్ర ఉల్లాస్ ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్లో మంగళవారం వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో గతేడాది నిర్వహించిన ఉల్లాస్ అక్షరాస్యతలో ఉత్తీర్ణులైన వారికి కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా వయోజన విద్యా నోడల్ అధికారి కెవివి సత్యనారాయణ మాట్లాడుతూ గతేడాది జిల్లాలో 3,930 మంది డ్వాక్రా గ్రూపుల మహిళలకు అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించగా వారిలో 3,895 మంది చదువు నేర్చుకుని ఉత్తీర్ణులై సర్టిఫికెట్లను సాధించారని తెలిపారు. డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ ఎస్.వేణుగోపాల్, డిపిఎంలు, ఎపిఎంలు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్ గ్రూపు సభ్యులు ఆర్థికంగా బలోపేతం కావాలి

ఎస్‌హెచ్‌జి గ్రూపు సభ్యులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్లో కలెక్టర్ అధ్యక్షతన డిఆర్‌డిఎ, పశుసంవర్ధక శాఖల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాదిని వినండి యాన్యువల్ క్రెడిట్ ప్లాన్ కింద జిల్లాకు 1,419 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ఎస్‌హెచ్‌జి మహిళలు పెరటి కోళ్లు, ఎద్దులు, దూడలు, పాడి గేదెలు, మేకలు పెంపకం యూనిట్లు, మినీ పౌల్ట్రీ ఫారం, గొర్రెల, పొట్టేళ్ల యూనిట్లు నెలకొల్పడం ద్వారా ఆర్థిక ప్రగతి సాధించాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు ఎల్‌కె.సుధాకర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జవ్వాది హుస్సేన్, డిపిఎంలు ఎస్.కృష్ణకుమారి, డి.వెంకటేశ్వరరావు, ఎం.బాలాజీ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి - ఆచంట

ఇటీవల గోదావరి వరదల నేపథ్యంలో ఆచంట వేమవరంలో నక్కల కాలువ సమీపంలోని పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో మంగళవారం వ్యవసాయ అధికారులు ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాలకొల్లు ఎడిఎ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ మండలంలోని ఆచంట వేమవరంలో అధిక వర్షాలు, గోదావరి ఉధృతి కారణంగా నక్కల కాలువ నుంచి మురుగునీరు వెనక్కి ప్రవహించడంతో ముంపు బారిన పడిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ దెబ్బతిన్న పంట పొలాలను గుర్తించామన్నారు. ముంపు నుంచి తేరుకున్న వరిచేలు తొందరగా కోలుకోవడానికి 15 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ తక్షణం వేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీల్లో జిల్లా జట్టుకు

అగ్రహారం విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ఉండి


జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

హ్యాండ్ బాల్ పోటీల్లో జిల్లా జట్టుకు ఎన్ఆర్‌పి అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఏలూరులోని ఇండోర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్-17 హ్యాండ్ బాల్ పోటీల్లో తమ పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి డి.మనో, అండర్-14 విభాగంలో, అండర్ 17 విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న చంద్రశేఖర్ నాయుడు, పదో తరగతి చదువుతున్న పి.సురేఖ ఎంపిక అయ్యారని తెలిపారు. తమ విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను, పిఇటి ఉపాధ్యాయులు కె.శ్రీనివాసరావును ఉపాధ్యాయ బృందం, సిబ్బంది అభినందించారు.

జనిత వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

జనిత వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిపిఎం ధనలక్ష్మి అన్నారు. గణపవరం పిహెచ్‌సిలో మంగళవారం ఆశాలు, ఎఎన్ఎంలకు మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దీనివల్ల వ్యాధులను అరికట్టొచ్చన్నారు. గర్భిణుల పేర్లు నమోదు చేసి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తిచేసి వారికి మంచి వైద్యసేవలందించాలన్నారు. ఆకుపచ్చని కూరలు తీసుకుంటే యుక్త వయస్సు ఆడపిల్లలకు రక్త హీనత లేకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ జాలాది విల్సన్ బాబు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన సదస్సు

ఆచంట: ఇ-పంట నమోదు చేసుకున్న రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని పాలకొల్లు ఎడిఎ పి.మురళీకృష్ణ అన్నారు. ఆచంట మృత్యుంజయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద సొసైటీ అధ్యక్షులు కడలి భాస్కరరావు అధ్యక్షతన సార్వా ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎడిఎ మాట్లాడుతూ కనీస మద్దతు ధర ఎ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ. 2,369గా నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి పూర్తిస్థాయిలో గోనె సంచులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులు, మధ్యవర్తులను సంప్రదించొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్ధాంతం వాటర్ డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షులు తమ్మినీడి ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు బొక్క సుబ్రహ్మణ్యం, బలుసు శ్రీరామ్మూర్తి సొసైటీ సెక్రటరీ వేంద్ర విష్ణుమూర్తి పాల్గొన్నారు.

'వైసిపి బలోపేతమే లక్ష్యం'

ఆచంట: గ్రామ స్థాయి నుండి వైసిపిని బలోపేతం చేయడమే లక్ష్యమని వైసిపి సీనియర్ నాయకులు సుంకర సీతారామ్ స్పష్టం చేశారు. మండలంలోని పెనుమంచిలిలో గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. పెనుమంచిలి వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులుగా గణేషుల సుబ్బారావును నియమించారు. ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నేతలు సుంకర సీతారాం, కర్రి వెనుబాబు, కోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి బలోపేతమే లక్ష్యంగా గ్రామ కమిటీలు వేయడం జరుగుతోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల తరపున ప్రతిపక్ష పార్టీగా పనిచేయాలని కోరారు. కూటమి పాలనలో వైసిపి కార్యకర్తలు ఎవరు ఇబ్బందిపడిన నేరుగా డిజిటల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. యూత్ అధ్యక్షులుగా నక్కా మహేష్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పంది రాజ్యలక్ష్మి, రైతు విభాగం అధ్యక్షులుగా నార్గన ఆంజనేయులు బిసి సెల్ అధ్యక్షులుగా చిట్టూరి దుర్గా ప్రసాద్, ఎస్‌సి సెల్ అధ్యక్షులుగా కొంబోత్తుల రత్నరాజు, మాజీ సర్పంచి నార్గన ఆంజనేయులు, 20 మందితో గ్రామ కమిటీని నియమించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి చిటికెన మంగారావు, వైసిపి నాయకులు కర్రి వేణుబాబు, ముత్యాల నాగేశ్వరరావు, కోట వెంకటేశ్వరరావు, గంటి బాబూరావు, కీర్తి తాతాజీ పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి - నరసాపురం

పేదలకు మెరుగైన సేవలందించేలా వైద్యులు కృషి చేయాలని ఎంఎల్ఎ నాయకర్ అన్నారు. మంగళవారం జనసేన కార్యాలయంలో నాయకర్ ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రి అభివృద్ధి, నిర్వహణ, ప్రజలకు అందించే వైద్య సేవలపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఆసుపత్రి మౌలిక సదుపాయాల అభివృద్ధి, వైద్య సిబ్బంది అందుబాటు, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటుపై సమగ్రంగా సమీక్షించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని ఎంఎల్ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి వైద్యాధికారులు, సిబ్బందితో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

9న పలుచోట్ల గ్రామ సభలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రజా సమస్యల పరిష్కరించేందుకు మాజీ ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తలపెట్టిన పల్లె పల్లెకు మన పితాని కార్యక్రమంలో భాగంగా 9వ తేదీ ఉదయం పెనుమంట్ర మండలం నెగ్గిపూడి, మధ్యాహ్నం పెనుమంట్ర గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జి.శ్రీదేవి ఇక్కడ తెలిపారు. పది ఉదయం 9 గంటలకు నెలమూరు గ్రామంలో పల్లె పల్లెకు మన పితాని గ్రామ సభ నిర్వహించిన అనంతరం కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహిస్తారని తెలిపారు.

సాహిత్యంలో సామాజిక స్పృహ అవసరం

నరసాపురం: సాహిత్యంలో వస్తువు, భాష, అభివ్యక్తి, సామాజిక స్పృహ, ప్రాపంచిక దృక్పథం అవసరమని, అప్పుడే అది పూర్తి ప్రామాణికతను సంతరించుకొని, ప్రజాదరణను పొందుతుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆచార్యులు ఆచార్య ఎన్‌వి.కృష్ణారావు అన్నారు. నరసాపురంలోని జివిఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్-వైఎన్ బిఇడి కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో 'తెలుగు సాహిత్యం - భాషా బోధన - మనో వికాసం'పై జాతీయ సదస్సు మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి పొన్నపల్లి రామారావు అధ్యక్షత వహించారు. కృష్ణారావు మాట్లాడుతూ తెలుగు భాషతోపాటు తెలుగు నేలపైన అనేక మాతృభాషలు ఉన్నాయనీ, వారంతా తెలుగు వారిగానే జీవిస్తున్నారని తెలిపారు. కొన్ని మాతృభాషలు మాట్లాడే వ్యక్తుల సంఖ్య నానాటికీ తగ్గిపోతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ తెలుగు విభాగం సహాచార్యులు పి.విజయకుమార్ మాట్లాడుతూ మాతృభాషలన్నింటినీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేసి భాషా వేత్తలు, పండితులు, విద్యావేత్తలు, సాంకేతిక నిపుణుల సహకారంతో వాటిని పదిల పర్చే కార్యక్రమాన్ని ప్రారంభం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తుచేశారు. నరసాపురం ఆర్‌డిఒ, వైఎన్ కళాశాల ఎక్స్ అఫిషియో ప్రెసిడెంట్ దాసిరాజు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో అనేక మాండలికాలు, యాసలు, ఉప భాషలు ఉన్నాయన్నారు. వైఎన్ వైస్ ప్రెసిడెంట్ చినమిల్లి సత్యనారాయణరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అందే రామసతీష్, ట్రెజరర్ పోలిశెట్టి రఘురామారావు, జివిఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ కానూరి స్వామినాయుడు మాట్లాడారు. సాహితీ జగత్తులో శిఖరాగ్రాన నిలిచే ప్రక్రియ కవిత్వమన్నారు. అనంతరం పలు అంశాలపై పలువురు ప్రముఖులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పత్రాలను సమర్పించారు.

ఆశాల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన నిరసనలు


పాలకోడేరులో ఆశాల నిరసన

ప్రజాశక్తి - పాలకోడేరు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ ఎస్.లారెన్స్ కుమారి విమర్శించారు. పాలకోడేరు పిహెచ్‌సి వద్ద ఆశా డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని వారు నినాదాలు చేసి నిరసన తెలిపారు. అనంతరం లారెన్స్ కుమారి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఆశాలతో సమానంగా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు అన్ని సౌకర్యాలూ, వేతనాలూ అందించాలన్నారు. ఆశా వర్కర్లు ఎవరైనా చనిపోతే మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 20 వేలు అందించాలన్నారు. అనంతరం పిహెచ్‌సి వైద్యురాలికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేరీ జాస్మిన్, శ్వేత, తరంగిణి, నీలిమ, మణిశ్రీ, సురేఖ పాల్గొన్నారు.

ఉండి : ఆశా కార్యకర్తలకు కనీస వేతనం ఇచ్చి వారి సమస్యలను పరిష్కరించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి లారెన్స్ కుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉండి, యండగండి పిహెచ్‌సిల వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లారెన్స్ కుమారి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు కరోనాను సైతం లెక్కచేయకుండా ప్రాణాలను పణంగా పెట్టి కరోనా సమయంలో పనిచేశారన్నారు. వారికి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు మండల సమన్వయ కమిటీ కన్వీనర్ ధనికొండ శ్రీనివాస్, కో కన్వీనర్ కొట్టాడ వెంకటేశ్వరరావు మద్దతు తెలిపి మాట్లాడారు. అనంతరం పిహెచ్ఎన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ సభ్యులు కిలారి తవిటి నాయుడు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


మొగల్తూరులో

ఆకివీడు : పిహెచ్‌సి వైద్యుల సమ్మెను ప్రభుత్వం వెంటనే విరమింపజేయాలని ఆ మేరకు న్యాయపరమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి లారెన్స్ కుమారి డిమాండ్ చేశారు. ఆశాడే సందర్భంగా స్థానిక అర్బన్ పిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్లు కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆశా నాయకురాలు రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో లారెన్స్ మాట్లాడారు. పేదలకు ఉచిత వైద్యం కావాలన్నా న్యాయం జరగాలన్న వెంటనే వైద్యుల సమస్య పరిష్కరించి వారు హాజరయ్యే ప్రభుత్వం చూడాలన్నారు. కార్యక్రమంలో ఇంటి మార్తమ్మ కె.తవిటి నాయుడు, పెంకి అప్పారావు, రాగరాణి, చిన్నయమ్మ, సిహెచ్ అశ్విని, ఇ.కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.


ఆకివీడులో..

మొగల్తూరు : అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్లు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం పిహెచ్‌సి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పి.బేబీకుమారి, లక్ష్మి, దుర్గ, సత్యవతి, రేవతి, అమ్మాజీ, కమల పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

రామాయణ మహాకావ్యాన్ని రచించి మానవాళికి అందించి సన్మార్గాన్ని నిర్దేశించిన ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి, జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఎవి.సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కాళ్లకూరు వెంకన్న సన్నిధిలో కలెక్టర్ నాగరాణి

కాళ్ల: కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం సందర్శించారు. ఆలయ అధికారులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వామివారి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.


ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలి

వ్యకాస జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పాలకోడేరులో వ్యవసాయ కార్మిక సంఘం పాలకోడేరు మండల పదో మహాసభ వీరవల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జెండాను సిహెచ్.సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రూ.600 వేతనం ఇవ్వడంతో పాటు సమ్మర్ అలవెన్స్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి కూలీలు సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యాప్తంగా అనేక ఉద్యమాలు చేసి కూలీలకు సంఘం అండగా నిలబడిందన్నారు. సంఘం మండల అధ్యక్షుడు శేషాపు అశ్రియ్య మాట్లాడుతూ 132 పని ప్రదేశాలను సందర్శించామని, అనేక సమస్యలను ఉపాధి కూలీలు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి మూడేళ్లల్లో అనేక పోరాటాలు చేసి ఫలితాలు సాధించామని తెలిపారు. అనంతరం గత మూడేళ్ల ఉద్యమాలను సమీక్షించుకుని రాబోయే మూడేళ్ల ఉద్యమ ప్రణాళికను రూపొందించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. రైస్ మిల్లర్స్ నాయకులు కలిదిండి గోపాలరాజు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు దున్న మరియమ్మ పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న సత్యనారాయణ


మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న స్వర్ణకుమారి

ఉపాధ్యాయిని స్వర్ణకుమారికి పలువురి అభినందనలు

ప్రజాశక్తి - యలమంచిలి

ఈనెల 5న అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ధర్మారావు ఫౌండేషన్ ద్వారా జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న చించినాడ ఎంపిపి ఎస్ (స్పెషల్ స్కూల్) ఉపాధ్యాయిని పాలంకి స్వర్ణకుమారిని పలువురు ప్రజా ప్రతినిధులతో పాటు మండల విద్యాశాఖ అధికారులు ఎ.శ్రీవాణి, కృష్ణంరాజు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణకుమారి మాట్లాడుతూ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్త కనకదుర్గకు అవార్డు

ప్రజాశక్తి - పెనుమంట్ర

కృషి, పట్టుదల తో పెనుమంట్ర సెక్టార్ పరిధిలోని ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర మండలాలకుగాను పెనుమంట్ర మండలం సోమరాజు ఇల్లింద్రపర్రు -1 అంగన్వాడీ కేంద్రం కార్యకర్త దొమ్మటి కనకదుర్గ బెస్ట్ అంగన్వాడీ కేంద్రం అవార్డు సాధించారు. ఈ మేరకు సోమవారం రాత్రి జిల్లా కేంద్రం భీమవరంలో జరిగిన అవార్డుల పంపిణీ వేడుకలో రాష్ట్ర, జిల్లా ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి నుండి ఈ అవార్డు అందుకున్నారు. కనక దుర్గకు అవార్డు రావడం సెక్టార్‌కు గర్వకారణమని సెక్టార్ సిడిపిఒ అంగర కృష్ణకుమారి, సూపర్‌వైజర్ పి.వరలక్ష్మి అన్నారు.

లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - మొగల్తూరు

పేదల ఆరోగ్యానికి సిఎం సహాయ నిధి అండగా ఉంటుందని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని కాళీపట్నం తూర్పు, కాళీపట్నం పడమర కొత్తట, ముత్యాలపల్లి గ్రామానికి చెందిన అనారోగ్యానికి గురైన పలువురికి సిఎం సహాయ నిధి రూ.11,86,440 చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో ఛాంబర్స్ స్వర్ణోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 11, 12 తేదీల్లో పాలకొల్లు ఛాంబర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు చెప్పారు. కళాశాల ఆవరణలో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.రెండున్నర కోట్లతో నిర్మించిన సముదాయానికి విద్యా శాఖా మంత్రి నారా లోకేష్, జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ప్రారంభిస్తారని తెలిపారు. సినీ గేయ రచయిత చేగొండి అనంత శ్రీరామ్, కులపతి ప్రొఫెసర్ ఎస్.ప్రసన్న పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా 8వ తేదీ బుధవారం పట్టణంలో విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తామని తెలిపారు. ఛాంబర్ కార్యదర్శి కటారి నాగేంద్రకుమార్, ఉపాధ్యక్షులు దేవరపల్లి లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు, వట్టం గణేష్ జూనియర్ ప్రిన్సిపల్ కార్మూరి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళితే గ్రామాల అభివృద్ధిలో అద్భుత ఫలితాలు సాధించొచ్చని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్పంచులు ప్రజలు వారికిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామాల అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్లాలని సూచించారు. సర్పంచి పదవీ కాలం చివరి రోజుల్లో శిక్షణ ఎందుకని ఎవరూ భావించొద్దని, రానున్న రోజుల్లో కూడా గ్రామాభివృద్ధికి ఒక పౌరుడిగా మీ భాగస్వామ్యం అవసరం అవుతుందని తెలిపారు. డ్రామా ఎపిడి జివికె మల్లికార్జునరావు మాట్లాడుతూ ఇటు పంచాయతీ నిధులు మరోపక్క ఉపాధి హామీ నిధులతో గ్రామాభివృద్ధి సాధించొచ్చన్నారు. జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజా సేవకు కట్టుబడి పని చేసే నాయకుడు పవన్ కళ్యాణ్ అన్నారు. ఎంపిడిఒ చంద్రశేఖర్ మాట్లాడారు.

విద్యార్థి వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యనభ్యసిస్తున్న బాలేపల్లి గ్రామానికి చెందిన నన్నేటి విజయ్‌కు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాబోధనేతర సిబ్బంది కలిసి మొత్తం రూ.83 వేలను వైద్యం నిమిత్తం మంగళవారం అందజేశారు. వీరవాసరం హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విజయ్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్య పరీక్షలు చేయగా కేన్సర్‌గా గుర్తించారు. విద్యార్థికి చికిత్స చేయాలంటే రూ.16 లక్షలు అవసరమవుతాయని వైద్యులు తెలిపారు. విద్యార్థి తండ్రి నాగార్జున రోజువారి కూలీ. ఆ కుటుంబం వైద్యం చేయించలేని దీనావస్థలో ఉంది. తమ వంతు సాయంగా హైస్కూల్ నుంచి కొంత ఆర్థిక సహాయం అందజేశారు. దాతలు ముందుకొచ్చి ఆర్థిక సహాయం చేయాలని కోరుతున్నారు. నన్నేటి నాగార్జున సెల్ నెంబరు 9989649505, స్టేట్ బ్యాంకు ఖాతా నెంబరు 31880915287 (ఐఎఫ్ఎస్‌సి -ఎస్‌బిఐఎన్0012666) సాయమందించాలని కోరారు.

గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి

నరసాపురం: గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి ముడిపడి ఉందని అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని మాస్టర్ ఆఫ్ ట్రెయినర్ బూసి రాజు అన్నారు. సుస్థిర గ్రామాభివృద్ధి లక్ష్యాలపై మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రెండు రోజుల పాటు ఎంపిపిలు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు చేపట్టిన మంగళవారం నుంచి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదరికంలేని సమాజం, జీవనోపాధి, పరిసరాల పరిశుభ్రత, సురక్షిత తాగునీటి సరఫరా, పచ్చదనం పెంపొందించేందుకు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎంపిపి సోని, ఎంపిడిఒ వికె.వీర భద్రరావు మాట్లాడుతూ శిక్షణ ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో, పారిశుధ్య విషయంలో మార్పులు కనపడాలన్నారు. ఇఒపిఆర్‌డి కె.నాగేంద్రకుమార్, ట్రెయినర్ ఆఫ్ ట్రెయిన్స్ పి.రవివర్మ, పి.సత్యనారాయణ, ఎస్.మక్సుద్ అలీ తదితరులు మాట్లాడారు.

ఎస్‌కెఎస్‌డిలో బాలికల జట్ల ఎంపిక

తణుకు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి జిల్లా కీర్తిని పెంచాలని ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల (జూనియర్) జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు అన్నారు. మంగళవారం స్థానిక కళాశాలలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో బాలికల క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు మాట్లాడుతూ పురుషులతో ధీటుగా మహిళలు కూడా క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని గెలుపొందడం మహిళాభివృద్ధికి నిదర్శనమన్నారు. చదరంగం, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్ విభాగాల్లో 200 మంది విద్యార్థినులు పాల్గొన్నట్లు తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా సెక్రటరీ కె.జయరాజు మాట్లాడుతూ చిట్టూరి సుబ్బారావు క్రీడలను బాగా ప్రోత్సహించే వారన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయ్, కాలేజ్ ప్రిన్సిపల్ వివి.సత్యనారాయణరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు డి.తారకమహాలక్ష్మి, ఎం.రత్నకుమారి పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తాం

ప్రజాశక్తి - నరసాపురం

వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, పాలకవర్గ సభ్యులు తెలిపారు. శ్రీమన్నారాయణ అధ్యక్షతన మంగళవారం ఎఎంసి సమావేశ మందిరంలో జరిగిన మొదటి పాలకవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో ఎఎంసి పాలనా పరమైన నివేదికను కార్యదర్శి శ్రీనివాస్ సమావేశం ముందుంచారు. నివేదికలో పేర్కొన్న కారు అద్దె తదితర అంశాలపై ఎఎంసి వైస్ ఛైర్మన్ లక్ష్మీ గంగాధర్, పాలకవర్గ సభ్యులు కొల్లాటి బాలకృష్ణ, వెన్నా సురేష్ బాబు తదితరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎఎంసి నిర్వహణ ఖర్చులు పారదర్శకంగా ఉండాలని, దుర్వినియోగానికి తావులేకుండా ఉండాలని తెలిపారు. ఇక నుంచి జరిగే ఎఎంసి కార్యకలాపాలను, ఖర్చులను ఎఎంసి పాలకవర్గంలో సంప్రదించి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. ఎఎంసి ప్రాంగణం, రక్షణ గోడ శిథిలమై కూలిపోయినందు వల్ల వాటిని పునర్మించాలని సమావేశంలో చర్చించారు. ఎఎంసి ద్వారా గ్రామాల్లో పుంతరోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పాలకవర్గ సభ్యుడు చిట్నిడి బాల వెంకటేశ్వర్లు కోరారు. పల్లంగా ఉన్న మార్కెట్ యార్డును మెరక చేయడం, ప్రాంగణం చుట్టూ కొత్తగా ప్రహరీ నిర్మించేందుకు, ఎఎంసి కార్యాలయంలో మౌలిక సదుపాయాలతో పాటు తాగునీటి సదుపాయం కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని కార్యదర్శిని కోరింది. ఎఎంసి ప్రాంగణం అభివృద్ధితో పాటు గ్రామాల్లో పుంత రోడ్లను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ త్వరలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంఎల్ఎ నాయకర్‌ను పాలకవర్గం కలిసివిజ్ఞప్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.


ఎఎంసి పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్, సభ్యులు

జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం గణపవరంలో స్థానికులకు, వ్యాపారులకు జిఎస్‌టిపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం జిఎస్‌టి తగ్గింపు వల్ల ధరలు తగ్గడంతో ప్రజలకు ఉపసమనం కలుగుతుందన్నారు. వ్యాపారులు కూడా జిఎస్‌టిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం స్థానిక డిగ్రీ కాలేజీ విద్యార్థులకు జిఎస్‌టిపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ జి.బాలయ్య, హైస్కూల్ హెచ్‌ఎం పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు : కేంద్ర ప్రభుత్వం ఇటీవల తగ్గించిన జిఎస్‌టి సామాన్యులకు ఏ రకంగా ఉపయోగపడుతుందని అంశంపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు ఈ అంశంపై ఎంఇఒ రవీంద్ర, ప్రధానోపాధ్యాయులు పారనాయుడు వివరించారు. దుంపగడపలోని వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ కె.శారద మాట్లాడారు.

10న పెన్షన్ అదాలత్

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్, జిపిఎఫ్‌పై ఈ నెల 10న భీమవరంలో పెన్షన్ అదాలత్ సందర్భంగా మండలంలోని పెన్షనర్ల సమస్యలపై 8వ తేదీన మార్టేరు రోటరీ క్లబ్ భవనంలో సమావేశం జరగనుందని పెన్షనర్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొత్త సత్యనారాయణ మూర్తి, పాలా ప్రసాద్ తెలిపారు. ట్రెజరీస్ అధికారులు, జిల్లా కలెక్టర్ సంయుక్తంగా నిర్వహించే 'పెన్షన్ అదాలత్‌'లో డిపార్ట్మెంటల్ డిడిఒలకు సంబంధిత పెన్షనర్లు తమ సమస్యలకు సంబంధించిన డాకుమెంటరీ ఎవిడెన్స్‌తో సహా హాజరై తక్షణ పరిష్కారం పొందాలని కోరారు.

వంతెన నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ఎంతో కృషి చేస్తున్నామని సర్పంచి కొల్లి సుబ్బారావు అన్నారు. దొడ్డనపూడిలో వంతెన నిర్మాణానికి ఆయన మంగళవారం భూమిపూజ చేశారు. కాసులమ్మ పేటకు వెళ్లే దారిలో పంటబోదెపై సుమారు రూ.9 లక్షలతో వంతెన నిర్మించనున్నారు. దశాబ్దాలుగా వంతెన లేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్తుల కష్టాలు తీరనున్నాయి. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆరేటి వెంకటరత్న ప్రసాద్, పంచాయతీ వార్డు సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.